క్లుప్తంగా

నేడు అప్రెంటిషిప్ మేళా

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లోని(ట్రేడ్ ఏదైనా) ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులకు ఈనెల10న ఉదయం 9.30 గంటలకు స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బుసిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. తోషిబా, ఎల్ అండ్ టీ, జాన్సన్ లిఫ్ట్స్, ఇండియా, టాటా, ఏరోస్పేస్, వరుణ్ మోటర్స్, ఆదర్శ మోటార్స్, రాణే ఇంజిన్ వాల్వ్, ఐటీసీ టెక్నాలజీస్, హైదరాబాద్, కరీంనగర్ నుంచి వివిధ కంపెనీలు వస్తున్నాయని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు అప్రెంటిషిప్ వెబ్‌సైట్‌లో తమ పేర్లు రిజిస్టర్ చేసుకొని తగిన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. వివరాల కోసం.. మల్లికార్జునస్వామి ట్రెనింగ్ ఆఫీసర్ సెల్ నంబరు 99896 16132, 97031 13881లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ ప్రతినిధులు

రామగుండం: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి ఆరోపణలపై బహిరంగ సవాల్‌ను స్వీకరించే దమ్ము లేదు.. ప్రస్తుత ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌పై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదు.. అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సాధ్యమని అంతర్గాం మండల కాంగ్రెస్ ప్రతినిధులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి పెంద్రు హన్మాన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, గాదె సుధాకర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్ది తిరుపతిగౌడ్, పూదరి సత్యనారాయణ, సింగం కిరణ్ కుమార్‌గౌడ్, బాదరవేణి స్వామి, సంకటి సుధాకర్ తదితరులున్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు స్థలాల గుర్తింపు

రామగుండం: నియోజకవర్గ పరిధిలోని 50 డివిజన్లు, అంతర్గాం, పాలకుర్తి మండలాల పరిధిలోని ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్ల బిగింపు, రాత్రి వాహనాదారులు రహదారులను గుర్తించేలా రేడియం సూచిక బోర్డులు, వాహనాల వేగ నియంత్రణకు బారికేడ్లు తదితర ఏర్పాటుకు రెండు రోజులుగా స్థానిక పోలీసు యంత్రాంగం స్థలాలను గుర్తిస్తూ వివరాలను నమోదు చేసుకుంటున్నారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే పలు కూడళ్లను గుర్తించారు. గోదావరిఖని వన్‌టౌన్ పరిధిలో బంగ్లాస్ ఏరియా, గంగానగర్ మంథని ఎక్స్‌రోడ్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, మున్సిపల్ జంక్షన్ ఏరియా, అశోక్ థియేటర్ ఏరియా, గాంధీచౌక్, రాజేశ్ థియేటర్ ఏరియా, ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో రామగుండం బైపాస్ రోడ్, ఇందిరమ్మకాలనీ మలుపు, మేడిపల్లి జంక్షన్, అంతర్గాం పోలీస్ స్టేషన్ పరిధిలో బుగ్గ క్రాస్ రోడ్ నుంచి ఐవోసీ, బుగ్గ క్రాస్ రోడ్ నుంచి అంతర్గాం పోలీస్ స్టేషన్, అంతర్గాం పోలీస్ స్టేషన్ నుంచి పెద్దంపేట రైల్వే గేట్, వయా ఎంపీడీవో కార్యాలయం, పెద్దంపేట పెట్రోల్ పంపు నుంచి వయా సోషల్ వెల్ఫేర్ స్కూల్ రైల్వే ఓవర్ బ్రిడ్జి, రామగుండం పోలీస్ స్టేషన్ పరిధిలో మల్యాలపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి, బీ-పవర్ హౌస్ నుంచి అయోధ్యనగర్ రోడ్, రామునిగుండాల మలుపు, రైల్వే స్టేషన్ ఏరియాలను గుర్తించారు.

బరువు తగ్గితే పరీక్ష చేయించుకోవాలి



వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో సూపర్‌వైజర్ వెంకట్‌రెడ్డి

సుల్తానాబాద్: షుగర్ ఉన్న ప్రతి ఒక్కరూ బరువు తగ్గితే వెంటనే టీబీ పరీక్ష చేసుకోవాలని గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఉదయ్‌కుమార్ సూచించారు. ఆదివారం కాట్నపల్లి గ్రామానికి చెందిన షుగర్ ఉన్న పలువురిని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి ఎక్స్‌రేలో టెస్ట్ కోసం తరలించారు. సుల్తానాబాద్ ఆసుపత్రి వద్ద రోగులతో మాట్లాడుతూ.. 30 సంవత్సరాలు పైబడిన వారందరికీ పరీక్షలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించడంతో ప్రభుత్వ వాహనంలో తరలించి వైద్య పరీక్షలు ఉచితంగానే చేయిస్తున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ వెంకట్‌రెడ్డి, ఏఎన్ఎం కె.కవిత, ఆశ కార్యకర్తలు విజయ, లావణ్య తదితరులున్నారు.

వైద్యశిబిరం సద్వినియోగం చేసుకోండి

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీసత్యసాయిబాబా మందిరంలో ఈనెల 11న నిర్వహించనున్న క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్యశిబిరాన్ని కాలనీ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సేవాసమితి కోకన్వీనర్ నూక రమేశ్ ఆదివారం తెలిపారు.

మామిడికి తేనెబంక తెగులు

- పూత దశలోనే పాడైన పంట



కాల్వశ్రీరాంపూర్‌లో తేనెబంక తెగులుతో పూత దశలోనే పాడైపోయిన మామిడి తోట

కాల్వశ్రీరాంపూర్: మామిడి రైతును తేనెబంక తెగులు నట్టేట ముంచింది. గంపెడాశతో మామిడి తోటను కౌలుకు తీసుకుంటే కౌలు పైకంతోపాటు సాగుకు, తెగులు మందులకు రూ.లక్షల్లో ఖర్చు పెట్టినా పంట దక్కలేదని మామిడి కౌలు రైతులు లబోదిబోమంటున్నారు. కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంతోపాటు తారుపల్లి, రాతుపల్లి, వెన్నంపల్లి, అంకంపల్లి, రాయపేట, మడిపెల్లి గ్రామాల్లో రైతులు మామిడి తోటలు పెంచుతున్నారు. గతేడాది ఈదురుగాలులతో మామిడి కాయలు రాలిపెట్టుబడి పంట నష్టపోయిన రైతులకు ఈ ఏడాది తేనెబంక తెగులు సోకి పూత దశలోనే మాడిపోయింది. ఎకరానికి రూ.30వేలు కౌలు చెల్లించి తోటలు తీసుకున్న రైతులు చెట్టు చుట్టూ ఏర్లు దున్నుడు, ఎండు కొమ్మలు విరిచడం, ఎరువులు, పురుగు మందులకు ఎకరానికి రూ.20వేలు ఖర్చు చేసినట్లు కౌలు రైతులు పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలతోపాటు తెగులు బెడద తప్పలేదని వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని పంట నష్టపోయిన మామిడి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సర్కారు ఆదుకోవాలి



నిరుడు ఈదురు గాలివానకు మామిడి కాయలు రాలి నష్టం వచ్చింది. ఈసారి తేనెబంక తగిలింది. 10 ఎకరాలు కౌలుకు తీసుకున్న. ఆకులు నల్లబడి పూత మాడిపోయింది. ఎకరానికి రూ.30వేలు కౌలు పైకం రూ.మూడు లక్షలు ముందే ఇచ్చిన. తేనెబంక పోవాలని తెగులు అరికట్టాలని మందు కొట్టినా తెగులు పోలేదు. సర్కారు ఆదుకోవాలి.

– చొప్పరి సదయ్య, కౌలు రైతు, కాల్వశ్రీరాంపూర్



జ్యోతినగర్: రహదారి పక్కన ప్రమాదకరంగా ఎండిన చెట్టు ఉండటంతో పలువురు భయాందోళన చెందుతున్నారు. ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లో ఉన్న ఎండిపోయిన పెద్ద వృక్షాలుండటంతో వాహనదారులు జంకుతున్నారు. ఎండిన చెట్టు కొమ్మలు రోడ్డుపై వెళ్లే వాహనదారులపై పడకముందే సంబంధిత అధికారులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఎలిగేడు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదివిన 1990–91 పదోతరగతి పూర్వ విద్యార్థులు 77 మంది ఆదివారం కరీంగనర్‌లోని శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. గురువులను సన్మానించారు. ఆటపాటలతో సంతోషంగా గడిపారు.

ముత్తారం: ముత్తారం జెడ్పీ పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందాన్ని పంచుకున్నారు. గురువులు శ్రీధరాచారి, శంకరయ్య, అశోక్‌రెడ్డి, ధర్మలత, రవీందర్‌రావును సత్కరించారు.

నవగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం

ధర్మారం: సాయంపేట గ్రామంలో శ్రీభక్తాంజనేయ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నవగ్రాహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంతోపాటు గ్రామంలో బొడ్డురాయిని ఏర్పాటు చేశారు. శ్రీశ్రీశ్రీ మౌనస్వామి దివ్య ఆశీస్సులతో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూజ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

వేంకటేశుని ఆలయంలో హోమం



పెద్దపల్లిరూరల్: అమర్‌నగర్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం హోమం నిర్వహించారు. పట్టణానికి చెందిన పలువురు భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2ఏరియా యైటింక్లయిన్ కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీవేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు, జగన్నాథచార్యుల ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రామగుండం: ఆశ్రమంలో అనాథలకు సేవ చేస్తున్న మహిళకు సత్కారం

మహిళా దినోత్సవం



జడ్జి స్వారికను సన్మానిస్తున్న న్యాయవాదులు

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. గోదావరిఖని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకటసచిన్‌రెడ్డి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి స్వారిక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 35 మంది మహిళా న్యాయవాదులను ఘనంగా సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొటం సతీష్, న్యాయవాదులు చెలికల పద్మజ, వరలక్ష్మి, పీపీ నదిమ, ఏజీపీ కొండు సౌజన్య, పాండురంగారావు, గోషిక ప్రకాశ్, సంతోష్, మహేందర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రామగుండం: పట్టణంలోని తబితా ఆశ్రమంలో అనాథ చిన్నారులకు సేవ చేస్తున్న మహిళను ఆదివారం ఫైట్ ఫర్ బెస్ట్ సొసైటీ నిర్వాహకులు శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. సొసైటీ ప్రతినిధి మద్దెల దినేశ్ మాట్లాడుతూ.. ప్రతీ మహిళలో దాగి ఉన్న శక్తిసామర్థ్యాలను వెలికితీసేందుకు వారిని ప్రోత్సహించాలన్నారు.

పట్టణంలోని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా ఆధ్వర్యంలో వివిధ శాఖల్లో విధులు నిర్వహించే మహిళలను సత్కరించారు. కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు కొండల రాజేందర్‌కుమార్, ఉపాధ్యక్షుడు జాగటి శాంతమ్మ, బోగె లింగమూర్తి, గడ్డం సత్యనారాయణ, రామ్‌కుమార్ తదితరులున్నారు.

గోదావరిఖనిటౌన్: స్థానిక మార్కండేయకాలనీలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ మండల ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి స్టార్ మహిళా కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు ఆటపాటల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఎన్.రమ్య స్టార్ మహిళ 2025 అవార్డు, 10వేల క్యాష్ ప్రైజ్, స్వప్నారెడ్డి 5వేలు, డి.అనిత 3వేల క్యాష్ ప్రైజ్‌ను గెలుచుకున్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



మంథని: జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం నాగునూర్ గామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన దుండగులను శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మంథనిలోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాల వేశారు. బూడిద గణేశ్, బూడిద తిరుపతి, గొర్రెంకల సురేశ్, ఇరుగురాళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయండి



విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ కార్యదర్శి గడ్డం తిరుపతి, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కోకన్వీనర్ బాలంకూస్ అన్నారు. అంబేడ్కర్, పూలేల జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం యైటింక్లయిన్‌కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి నాయకులతో కలిసి పూలమాల సమర్పించి మాట్లాడారు.

అభినందన పత్రం అందజేత



యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీకి చెందిన జాడి మీనా ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా.. కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానం చేశారు. ఆదివారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆమె సంస్మరణ సభలో నేత్రదాత కుటుంబ సభ్యులకు అభినందన పత్రాన్ని ఫౌండేషన్ ప్రతినిధులు అందజేశారు.



రాజాబాబుకు నివాళి

గోదావరిఖని: అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన ప్రముఖ సినీ నటి, మాజీ ఎంపీ జయప్రద సోదరుడు రాజాబాబు కుటుంబాన్ని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాగూర్ కుటుంబ సభ్యులు ఆదివారం పరామర్శించారు. హైదరాబాద్‌లోని వారి నివాసానికి వెళ్లి రాజాబాబు చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళి అర్పించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి




అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమేశ్

మంథని: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మంథని ఎస్‌ఐ రమేశ్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వాహనదారులకు అవగాహన కల్పించారు.

కాంగ్రెస్‌తోనే దళితుల అభివృద్ధి

రామగిరి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, మంత్రి శ్రీధర్‌బాబు నిధుల కేటాయింపు, ప్రభుత్వం ఇస్తున్న అవకాశాల వల్లే దళితులు అభివృద్ధి సాధిస్తున్నారని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కండె పోచం అన్నారు.

డీసీఎం వ్యాన్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్



సుల్తానాబాద్: పట్టణానికి చెందిన పోడెటి శ్రీనివాస్‌గౌడ్‌ను డీసీఎం వ్యాన్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఆదివారం శాస్త్రినగర్‌లోని వ్యాన్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఎన్నికలు నిర్వహించారు. జనరల్ సెక్రటరీగా కనవేణి రమేశ్‌యాదవ్, వైస్ ప్రెసిడెంట్‌గా లంకదాసరి రాజశేఖర్, జాయింట్ సెక్రటరీగా హన్మంతు, కోశాధికారిగా బండారి చంద్రయ్యను ఎన్నుకున్నారు.

ఓసీపీ-1లో షావల్ దగ్ధం

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–3 పరిధిలోని ఓసీపీ–1 ప్రాజెక్టులో టాటాహిటాచీ షావల్ ఆదివారం రాత్రి దగ్ధమైంది. క్వారీలోని కోల్‌స్టాక్ యార్డులో కోల్ లిఫ్టింగ్ చేస్తున్న షావల్‌కు మంటలంటుకొని ఈ ప్రమాదం జరిగినట్లుగా తెలుస్తోంది. అధికారులు, కార్మికులు వెంటనే అక్కడకి చేరుకొని మంటలార్పారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వేలంలో పాల్గొనాలని లేఖ ఇవ్వడం శోచనీయం



గోదావరిఖని: బొగ్గు గనుల వేలం పాటలో సింగరేణి పాల్గొనాలని గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలు లేఖ ఇవ్వడం అన్యాయమని హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ విమర్శించారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడారు. సింగరేణి వేలంలో పాటలో పాల్గొంటే సంస్థకు తీవర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం బొగ్గు బ్లాకులను బేషరతుగా సింగరేణికి కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల నాయకులు సీతారామయ్య, జనక్‌ప్రసాద్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వద్దకు వెళ్లి వేలంలో పాల్గొనాలని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈవిషయంలో తాము ఊరుకోబోమని హెచ్చరించారు. ఈసంఘాల ద్వంద్వ నీతిని ఎండగడతామన్నారు. సంస్థలో పనిచేసి రిటైర్డ్ అయిన ఉన్నతాధికారుల సహకారంతో కాంట్రాక్టర్లు వాటిని దక్కించుకుంటారని, వేలం పాటలో పాల్గొనడం ద్వారా సింగరేణి గుర్తించిన బ్లాకులు మనకు దక్కవన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల తీరుపై సోమవారం హెచ్ఎంఎస్ కేంద్ర కార్యాలయంలో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక సమావేశం కానున్నామన్నారు. ఇందులో భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేస్తామని ఆయన వెల్లడించారు. సంస్థను కాపాడుకునేందుకు కార్యదీక్షతో ముందుకు సాగుతామన్నారు.

పద్మశాలీ మహాసభకు తరలిన నాయకులు



ఎలిగేడు నుంచి వెళ్తున్న పద్మశాలీలు

ఎలిగేడు: 17వ అఖిల భారత పద్మశాలీ మహాసభ, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం మహాసభలను హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించగా.. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల నుంచి పద్మశాలీ కుల బాంధవులు తరలివెళ్లారు. పద్మశాలీ సేవాసంఘం మండల అధ్యక్షుడు మామిడాల రమేశ్, శ్రీనివాస్, కట్ల తిరుపతి, ప్రకాశ్, ఊసకోయిల భూపతి, రాజయ్య తదితరులున్నారు.

గోదావరిఖనిటౌన్: 17వ అఖిల భారత పద్మశాలీ మహాసభ, 8వ తెలంగాణ పద్మశాలీ మహాసభల కోసం పద్మశాలీ సంఘం సభ్యులు హైదరాబాద్‌కు బయలుదేరారు. బండారి రాయమల్లు, బూర్ల దామోదర్, సిరిమల్ల జయరాములు, సిరిపురం నర్సయ్య, వడ్డేపల్లి దినేశ్ తదితరులున్నారు.

పెద్దపల్లిరూరల్: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన పద్మశాలీ మహాసభకు పెద్దపల్లి ప్రాంతం నుంచి పద్మశాలీ సంఘం నాయకులు బస్సులో తరలివెళ్లారు.

జూలపల్లి: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన అఖిల భారత పద్మశాలీ మహాసభకు జూలపల్లి మండలం నుంచి పద్మశాలీ కుల సంఘం నాయకులు తరలివెళ్లారు. ఉప్పుల తిరుపతి, వెంకటేశం, భూమయ్య, శ్రీనివాస్, అశోక్, రాయమల్లు, రమేశ్, రాంనారాయణ, నాగరాజు తదితరులున్నారు.

ముత్తారం మండలానికి రూ.97లక్షలు



శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

ముత్తారం: మండలానికి సీఆర్ఆర్ నిధులు రూ.97.50లక్షలు మంజూరు చేయించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటానికి ఆదివారం ఓడెడ్‌లో కాంగ్రెస్ నాయకులు, ఎస్సీకాలనీవాసులు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల ఎస్సీకాలనీలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎడవెన సంపత్, రత్న కొంరయ్య, అల్లాడి యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్లోకి పేదోడి ఫ్రిజ్

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మార్కెట్లోకి పేదోడి ఫ్రిజ్‌లుగా భావించే రంజాన్లు అందుబాటులోకి వచ్చాయి. సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇప్పటికీ వీటిని ఉపయోగిస్తున్నారు. ఒక్కటి రూ.50 నుంచి రూ.100 వరకు అమ్మకాలు చేస్తున్నారు. వేసవి కాలం తీవ్రతరం కావడంతో ఎక్కువగా కొనుగోలు చేస్తున్నట్లు అమ్మకందారులు చెబుతున్నారు. ఆదిలాబాద్ రంజాన్లకు భలే గిరాకీ ఉంటుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.